బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కొండాపూర్, మే 6: మండలంలోని మారేపల్లిలో మంగళవారం లక్ష్మీనారాయణ స్వామి 8వ బ్రహ్మోత్సవాల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు అలయ కమిటీ కోరిక మేరకు ఎమ్మెల్యే నిధులు రూ. లక్షతో కమ్యూనిటీ హాల్, ఆలయ ఎదుట రూ.10 లక్షలతో సీసీ రోడ్డును ఏర్పాటు చేశారు. ఈసారి కూడా ఆలయానికి సహకారం అందించాలని కోరడంతో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తనవంతు సహాయసహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు చింతా సాయినాథ్, మండల పార్టీ అధ్యక్షుడు మ్యాకం విఠల్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మల్లాగౌడ్, లక్ష్మారెడ్డి, మాణిక్య ప్రభు, సొసైటీ చైర్మన్లు రాజు, పవన్‌కుమార్, శివకుమార్, ఆంజనేయులు గౌడ్, అంజిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి

కొండాపూర్, మే 6: భూ సమస్యల పరిష్కారానికే భూభారతి చట్టాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందని ఆర్డీవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గారకుర్తిలో నిర్వహించిన భూభారతి సదస్సులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూభారతి చట్టంపై రైతులకు ఇటీవల అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం గ్రామాల్లో ఈ సదస్సులను ప్రారంభించిందన్నారు. గ్రామాల్లోనే రెవెన్యూ విభాగంలో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రైతులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భూభారతి ప్రత్యేక అధికారి దేవుజ, తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ మర్రి ప్రదీప్, ఆర్ఐ మల్లం రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు బలవంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అందుకున్న వైద్యాధికారి

పీహెచ్‌డీ అందుకుంటున్న న్యాల్‌కల్ ఆయుర్వేద వైద్యాధికారి గణపతిరావు

జహీరాబాద్, మే 6: న్యాల్‌కల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆయుర్వేద వైద్యాధికారి గణపతిరావు కర్ణాటక గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. గణపతిరావు బీదర్‌లోని ఎస్‌కే జబ్బాశెట్టి ఆయుర్వేదిక కళాశాలలో 'భగంధర వ్యాధిలో పలాశక్షార సూత్ర చికిత్స'లో పరిశోధన చేశారు. ఈ మేరకు మంగళవారంం కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూర్‌లోని రాజీవ్‌గాంధీ ఆరోగ్య విశ్వవిద్యాలయం 27వ ఘటికోత్సవంలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. గణపతిరావు పీహెచ్‌డీ అందుకున్నందుకు న్యాల్‌కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

అద్దె చెల్లించలేదని.. తహసీల్ కార్యాలయానికి తాళం

తహసీల్ ఆఫీసుకు భవన యజమాని తాళం వేయగా బయట ఉన్న తహసీల్దార్, సిబ్బంది

సిర్గాపూర్, మే 6: సిర్గాపూర్‌లోని తహసీల్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. రెండేండ్ల నుంచి భవనం అద్దె బకాయి చెల్లించడం లేదని ఆగ్రహించిన ఇంటి యజమాని నర్సమ్మ మంగళవారం ఆఫీసుకు వచ్చి అద్దె విషయమై తహసీల్దార్ ఏఎన్ ఖాన్‌కు అడిగింది. దాదాపు రూ. 5 లక్షల వరకు కిరాయి బిల్లులు రావాల్సి ఉందని ఆమె ఆవేదనతో తెలిపింది. ఇటీవల కొత్తగా వచ్చానని, ఇంటి కిరాయి విషయం తనకు తెలియదని, ఉన్నతాధికారులను అడిగి చెబుతామన్నారు. ఓనర్ వినకుండా అధికారులు, సిబ్బందిని బయటకు పంపి ఆఫీసు భవనానికి తాళం వేసింది. అప్పుడు సమయం సాయంత్రం 4 గంటలు అవడంతో చేసేది ఏమి లేక అధికారులు ఇండ్లకు వెళ్లిపోయారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ అడగ్గా భవనం అద్దె పెండింగ్‌లో ఉందన్నారు. ఆర్డీవో, అదనపు కలెక్టర్‌కు అద్దె పెండింగ్ సమాచారాన్ని తెలియజేసినట్లు చెప్పారు.

నారాయణ హైస్కూల్ సీజ్

వెలిమెలలో నారాయణ హైస్కూల్‌ని సీజ్ చేస్తున్న ఎంఈవో పీపీ రాథోడ్

రామచంద్రాపురం, మే 6: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో అనుమతి లేకుండాఏర్పాటు చేసిన నారాయణ హైస్కూల్‌ను ఎంఈవో పీపీ రాథోడ్ సీజ్ చేశారు. పాఠశాల నిర్వహణ కోసం విద్యాశాఖ నుంచి అనుమతులు పొందకుండా అడ్మిషన్లు ప్రారంభించారు. ఈ విషయం విద్యాశాఖ అధికారుల దృష్టికి రావడంతో డీఈవో వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎంఈవో పీపీ రాథోడ్ నారాయణ హైస్కూల్‌ను సందర్శించి నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని నిర్ధారించి సీజ్ చేశారు. పాఠశాల నిర్వహణ కోసం విద్యాశాఖ నుంచి అనుమతులు తీసుకోకుండా పాఠశాలకు సంబంధించిన కరపత్రాలు, పాఠ్యపుస్తకాలు పంచుతూ అడ్మిషన్లు తీసుకోవడంతో సీజ్ చేశామన్నారు. ప్రభుత్వ అనుమతులు లేని పాఠశాలలో విద్యార్థులను చేర్పించినట్లయితే విద్యాశాఖ ఎలాంటి బాధ్యత వహించదని తెలిపారు. గుర్తింపులేని పాఠశాలలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

రామచంద్రాపురం, మే 6: తెల్లాపూర్‌లోని గద్దర్ విగ్రహం ప్రాగణంలో ఆస్క్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో భాగంగా బుధవారం నుంచి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. కబడ్డీ పోటీల్లో మొత్తం 26టీంలు బరిలో నిలిచాయి. ఆస్క్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ కొల్లూరి అమృతాసత్తయ్య, కార్యదర్శి భరత్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు కబడ్డీ పోటీలు జరుగనున్నాయి. కార్యక్రమంలో నాయకులు, ఆస్క్ సొసైటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎగిసిపడిన మిషన్ భగీరథ నీరు

ఎగిసిపడుతున్న మిషన్ భగీరథ తాగునీరు

కంది, మే 6: పైప్‌లైన్ పగిలి మిషన్ భగీరథ నీరంతా ఎగిసిపడింది. మంగళవారం కంది శివారులోని మిషన్ భగీరథ పైప్‌లైన్ పగలడంతో ఒక్కసారిగా తాగునీరంతా వృథాగా పోయింది. భారీ ప్రెషర్‌తో ఎగిసిపడుతున్న నీటిని రహదారిపై వెళ్తున్న వాహనాదులు ఆసక్తిగా చూశారు. పైనే హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉండటంతో కొందరు భయాందోళనకు లోనయ్యారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో నీటి సరఫరాను నిలిపివేశారు. తరచూ పైప్‌లైన్లు పగిలిపోవడం, మరమ్మతులతో నీటి సరఫరా నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

- రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు సభావత్ రాములునాయక్
- నల్లవల్లి, అన్నారం గ్రామాల్లో పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు

సదాశివపేట: చెరుకుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విజయ్‌కుమార్

గుమ్మడిదల: అన్నారంలో మాట్లాడుతున్న సభావత్ రాములు నాయక్

గుమ్మడిదల, మే 6: పంటలను సేంద్రియ పద్ధతిలో సాగుచేయడం వల్ల మంచి దిగుబడితో పాటు ఆరోగ్యకరమైన పంటలను సాధించవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు సభావత్ రాములు నాయక్ పేర్కొన్నారు. మంగళవారం అన్నారంతో పాటు మండలంలోని నల్లవల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలతో వివిధ పంటలపై ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన నిర్వహించారు. ఇందులో అసోసియేట్ ప్రొఫెసర్ డా.కె.సుమాలిని, నత్నయ్యపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.శోభారాణి, పటాన్‌చెరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.మనోహర, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ రావు, ఆత్మకమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ కమిషన్ సభ్యుడు మాట్లాడుతూ రైతులు యూరియాను మోతాదుకు మించి వాడకూడదన్నారు. రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల భూసారం తగ్గి నేలలో పంటలు సాగు చేయలేని పరిస్థితి వచ్చి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అనంతరం అసోసియేట్ ప్రొఫేసర్ డా.కె.సుమాలిని మాట్లాడుతూ పంటల మార్పిడి చేయడం వలన చీడపీడలను తగ్గించి మంచిదిగుబడి సాధించవచ్చాన్నారు. పంట విత్తినప్పటి నుంచి పంట కోసేవరకు విత్తనాలకు సంబంధించిన రశీదులు భద్రపరుచుకోవాలని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సాగు చేస్తున్న మేలైన వంగడాల గురించి రైతులకు వివరించారు. అనంతరం అసోసియేట్ ప్రొఫెసర్ డా.సుమాలిని మాట్లాడుతూ వరిసాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, పచ్చిరొట్ట ఎరువుల పంటలైన జనుము, జీలుగ అవశ్యకతను విశదీకరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.హేమలత, డా.జానకి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి, డైరెక్టర్లు జయశంకర్‌గౌడ్, ఏవో శ్రీనివాస్‌రావు, ఏఈవో నఖిత, ప్రణవి, స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

సదాశివపేట, మే 6: మండలపరిధిలోని ఆత్మ కూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బసంత్‌పూర్ పరిశోధన కేంద్ర ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త విజయ్‌కుమార్, శాస్త్రవేత్త విజయలక్ష్మి చెరుకు, వరి, పత్తి వివిధ రకాల పంటలు, పంటలకు సోకే తెగుళ్లకు నివారణ చర్యలు, పెట్టుబడి ఎలా తగ్గించుకోవాలనే విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, ఏడీఏ వెంకటలక్ష్మి, గణపతి షుగర్స్ జనరల్ మేనేజర్ కృష్ణమోహన్, ఏవో రమేశ్, క్లస్టర్ ఏఈవో శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న జడ్జి కవితాదేవి

జహీరాబాద్, మే 6: రాజీ మార్గమే రాజ మార్గమని, జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి అన్నారు. మంగళవారం కోర్టులో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌లో రాజీగల నేరాలు, గృహహింస, వరకట్నం తదితర కేసుల్లో రాజీ కుదుర్చుకోవాలన్నారు. ఆ దిశగా స్టేషన్ల వారీగా కేసులను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. లోక్‌అదాలత్‌పై ప్రచారం చేయాలని సూచించారు. జహీరాబాద్ సబ్‌డివిజన్ పరిధిలోని కేసులను రాజీ చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌పై ఏదైనా సమాచారం కావాలంటే తహసీల్దార్లు, న్యాయవాదులు, పోలీసు అధికారులను సంప్రదించాలన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అక్రమ షెడ్ల తొలిగింపు

పారిశ్రామికవాడలో షెడ్డును జేసీబీతో తొలిగిస్తున్న మున్సిపల్ అధికారులు

జిన్నారం, మే 6: బొల్లారం పారిశ్రామికవాడలో రోడ్డు పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లను మున్సిపల్ అధికారులు మంగళవారం తొలిగించారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పలు షెడ్లను మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, సీఐ రవీందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం పోలీసుల సహకారంతో అక్రమ షెడ్లను జేసీబీ, క్రేన్ల సాయంతో తొలిగించారు. తొలిగిస్తున్న సమయంలో మహిళలు అడ్డుకునేందుకు ప్రయత్నించగా అధికారులు వారించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా షెడ్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది నవీన్, రవి, దినేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, ఎస్సై దశరథ్, పోలీస్ సిబ్బంది, విద్యుత్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కరపత్రాన్ని విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

సదాశివపేట, మే 6: కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయం ఎదుట సార్వత్రిక సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అనుకూలంగా ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి పెట్టుబడుదారులకు అనుకూలంగా తయారు చేస్తుందని విమర్శించారు. ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు మల్లేశం, శ్రీనివాస్, సత్యనారాయణ, మోహన్‌చారి, రవి, పాండురంగం, శ్రీనివాస్‌గౌడ్, ప్రసాద్‌కుమార్, జావిద్ పాల్గొన్నారు.

91వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

నల్లవల్లిలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు

గుమ్మడిదల,మే 6: ప్యారానగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతనే ఉన్నాయి. మంగళవారం మం డలంలోని నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా రైతు జేఏసీ నాయకులు 91వ రోజు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్యారానగర్ సమీపంలో ఏర్పాటు కాబోతున్న డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాం డ్ చేశారు. మూడు నెలలుగా ఎంఎస్‌డబ్ల్యూకు వ్యతిరేకంగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ఇక్కడి గ్రామాల ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని డంపింగ్ యార్డును రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

కానుకుంటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జయశ్రీ

గుమ్మడిదల, మే 6: ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్డీఏ డీపీఎం జయశ్రీ పరిశీలించారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి, కానుకుంట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కొత్తపల్లిలో మంగళవారం ఒక్కరోజు 26 మంది రైతులు 2106 బస్తాలు(984.80 క్వింటాళ్ల ధాన్యం), కానుకుంటలో 24 మంది రైతులు 2106 బస్తాలు(842.80) క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అనంతరం రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా పలు సూచనలు చేశారు. వీరితోపాటు ఐకేపీ ఏపీఎం శివకుమార్, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సదాశివపేట, మే 6: వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003-04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గడిచిన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

పట్లూర్ జడ్పీహెచ్‌ఎస్ 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

చింతల్‌ఘాట్‌లో విగ్రహాల ప్రతిష్ఠాపన

కోహీర్, మే 6: మండలంలోని చింతల్‌ఘాట్‌లో దుర్గా భవానీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు మంగళవారం ప్రత్యేక పూజ లు చేశారు. ఉదయం ధ్వజారోహణం, గోపూజ, పుణ్యాహవచనం, ధాన్యాధివా సం, జలాధివాసం చేశారు. బుధవారం ఆలయావరణలో హోమం, గురువారం విగ్రహాల ప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠ, శుక్రవారం బోనాల ఊరేగింపు నిర్వహిస్తామని నిర్వాహకులు కోరారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి, రామలింగారెడ్డి, మల్లన్నసాటిల్, మధుకర్‌రెడ్డి, బస్వరాజ్, మాణిక్‌రెడ్డి, సంగన్న, నర్సింహారెడ్డి, చంద్రప్ప పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తితే సిబ్బందిపై చర్యలు

సంగారెడ్డి, మే 6: జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి సాయి బాబా హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయం నుంచి జిల్లాలోని డీఎల్‌పీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తాగునీటి సమస్యపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ జిల్లాలో కంగ్టి తరహాలో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని నీటి ఎద్దడి సమస్యను ఎక్కడికక్కడ పరిష్కరించుకునే విధంగా అధికారులు పనిచేయాలన్నారు. ప్రతి గ్రామంలో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తే గ్రామంలో తలెత్తిన నీటి ఎద్దడి సమస్యను అందులో పెట్టగానే క్షేత్రస్థాయి సిబ్బంది చూసి వెంటనే పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయాలని, కార్యదర్శులు, అధికారులను గ్రూపుల్లో చేర్చి నీటి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, వారి ఒక ఏరియా ఆఫీస్ చందానగర్ వద్ద ఉన్న వారు తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు మండలం, ఇంద్రేశం గ్రామం వద్ద గల సర్వే నెం.141/Aలో 745 చ.అ. బిల్టప్ ఏరియాతో, 100 చ.గజాలు లేదా 83.60 చ.మీటర్లు విస్తీర్ణం, ప్లాట్